వేడెక్కిన రాజకీయం

- నాగిరెడ్డిపేట ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల
- 28న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం

నాగిరెడ్డిపేట : చాలాకాలంగా ఖాళీగా ఉన్న నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయడంతో నాగిరెడ్డిపేటలో రాజకీయ పరిస్థితులు మరోసారి వేడెక్కనున్నాయి. 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పటి నుండి నాగిరెడ్డిపేట ఎంపీపీ అధ్యక్ష పదవి ఖాళీగానే ఉంది. అప్పటి నుండి కూడా వైస్ ఎంపీపీగా ఎన్నికైన తాండూర్ ఎంపీటీసీ సభ్యుడు దివిటి రాజ్‌దాస్ నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్‌కు ఇన్‌చార్జి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గతఏడాది వైస్‌ఎంపీపీ రాజ్‌దాస్‌పై మండ లంలోని ఇతర ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం పె ట్టి ఆయనను అధ్యక్ష పదవి నుండి కిందకు దింపే ప్రయత్నం కూడా చేశారు. కాని నాగిరెడ్డిపేట ఎంపీపీగా కొనసాగుతున్న రాజ్‌దాస్ కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో అవిశ్వాస బలపరీక్ష వాయి దా పడింది. తాజాగా నాగిరెడ్డిపేట ఎంపీపీ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా నేడో, రేపో నాగిరెడ్డిపేట మండలంలోని 9 మంది ఎంపీటీసీ స భ్యులకు అధికారులు నోటీసులివ్వనున్నారు.

నాలుగేళ్లుగా ఇన్‌చార్జి పాలనే..

నాగిరెడ్డిపేట మండలంలో పది ఎంపీటీసీ స్థానాలున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో ఐదుస్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్, మరో మూడు స్థానాల్లో స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. కాగా నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో కాంగ్రెస్ నుండి గెలుపొందిన ఇద్దరు మహిళా ఎంపీటీసీలు నాగిరెడ్డిపేట ఎంపీపీ పదవిని ఆశించారు. ఈ క్రమంలో పోచారం ఎంపీటీసీ సభ్యురాలు వినీత కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవగా అదే పార్టీ తరఫున గెలుపొందిన ధర్మారెడ్డి ఎంపీటీసీ కృష్ణవేణి కూడా పోటీకి రెడీ అయ్యారు. ఎన్నికల్లో ఇద్దరికీ తలా ఐదు ఓట్లు చొప్పున వచ్చాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో అధికారులు డ్రా తీశారు. డ్రాలో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి కృష్ణవేణికి అదృష్టం వరించింది. దీంతోపాటు వైస్ ఎంపీపీ పదవికి తాండూర్ ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌దాస్‌తోపాటు చీనూర్ ఎంపీటీసీ సభ్యురాలు గుర్రాల సుశీల పోటీ పడ్డారు. వీరికి కూడా సమానంగా ఓట్లు రావడంతో డ్రా తీశారు. డ్రాలో రాజ్‌దాస్ పేరు రాగా వైస్‌ఎంపీపీగా ఎన్నికయ్యారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు..

నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 28న ఉదయం 11గంటలకు ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరాస్వామి తెలిపారు. మండలంలోని తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులకు ఎంపీపీ ఎన్నిక నిర్వాహణకు సంబంధించి ఈ నెల 24లోపు నోటీసులు అందించనున్నట్లు ఆయన చెప్పారు.

పార్టీ నిర్ణయం వ్యతిరేకించారని..

ఎంపీపీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతోపాటు విప్ ధిక్కరించడంపై కాంగ్రెస్ నేతలు కృష్ణవేణిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపగా తనకు విప్ అందలేదని, విప్ తీసుకున్నట్లు చేసిన సంతకం తనది కాదని ఆమె పేర్కొనడంతో అధికారులు ఆమె సంతకం ఎవరితో తేల్చేందుకు ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. సంతకం ఆమెదే అని రుజువుకావడంతో ఎంపీటీసీగా కృష్ణవేణిని అనర్హురాలిగా ప్రకటించారు. దీంతో ఎంపీపీ పదవి ఖాళీ అయింది. అప్పటి నుండి వైస్‌ఎంపీపీ దివిటి రాజ్‌దాస్ ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మోహరీల్ శ్రీనివాస్‌రావు గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్‌పార్టీ బాన్సువాడ సెగ్మెంట్ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రావు, మండలాల నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

స్థానిక అవసరాలకు ఇసుక కేటాయించాలి



బాన్సువాడ : స్థానిక, గృహ అవసరాలకు మంజీరా నది నుంచి ఇసుకను తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని బీర్కూర్ గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఇసుక కొరతతో గృహనిర్మాణాలు నిలిచిపోయాయని, కూలీలకు పనిదొరకడం లేదన్నారు. ఇసుక తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఎంపీపీ రఘు, నాయకులు ఆరీఫ్, సందీప్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రాజంపేట : మండలం ఆర్గొండ గ్రామంలోని బతుకమ్మ కుంట వద్ద సీసీ రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ నిధులతో ఈ సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు చౌదరి రాజు, ఉపాధ్యక్షులు సాయిలు, ఏఈ కల్పన, సెక్రటరి లక్ష్మణ్ నాయకులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ



భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి సహకార సంఘం పరిధిలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో సొసైటీ స్థలంలో షెడ్డు నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ వెంకటరెడ్డి, సీఈవో శ్రీనివాస్, నేతలు రాజిరెడ్డి, పరమేశ్వ ర్, శ్రీనివాస్‌రెడ్డి, తరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి..




నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఈద్గా కోసం గురువారం గ్రామ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కంది మల్లేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్గా నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 5లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖలీల్, ఫయాస్, రఫీక్, యూసూఫ్, అస్కర్, సత్తర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామంలో ఓ బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన జిన్న సాయిలు తన బైక్‌ను ఈనెల 18న గ్రామ చౌరస్తాలోని ఓ దుకాణం ఎదుట నిలిపి బస్సులో పిట్లంకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కృష్ణ దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పుస్తె మట్టెల పంపిణీ



రామారెడ్డి(ఎల్లారెడ్డి) : రామారెడ్డి మండలం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కాచిగూడ మహాసభ నుంచి మద్దికుంటలో గురువారం ముదాం బాలయ్య–శ్యామల కుమార్తె విజయలక్ష్మి వివాహానికి పుస్తెమట్టెలు అందజేశారు. అలాగే రెడ్డిపెట్ గ్రామంలోని శెట్టిపల్లి లింగం–లక్ష్మి దంపతుల కుమార్తె శ్రీజకు వివాహానికి పుస్తెమట్టెల అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రామారెడ్డి మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కడెం శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి కాల హనుమాండ్లు, చంద్రశేఖర్, స్వామి, ల్యాగల మహిపాల్, రాజు,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చేయించుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ప్రతిఒక్కరూ పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన పోస్టల్ సిబ్బందితో పాటు పలువురికి పోస్టల్ గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీ గురించి వివరించారు. పోస్టల్ పాలసీని తీసుకుని ప్రమాదవశాత్తు మృతి చెందిన నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామానికి చెందిన పుప్పాల పాలబాబు కుటుంబానికి రూ. 10 లక్షల చెక్కును అందించారు.


ఎల్లారెడ్డిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారులు

వాహనదారులకు జరిమానాలు


నిజాంసాగర్‌లోని పెద్దపూల్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్) : మండలం కేంద్రంలో శివారులోని పెద్దపూల్ బ్రిడ్జి వద్ద గురువారం స్థానిక ఏఎస్సై రాజేశ్వర్ బైక్‌లకు రూ. 3,110 జరిమానా విధించారు. హెల్మెట్ లేకుండా, ధృవపత్రాలు సక్రమంగా లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమనాలు విధించామని చెప్పారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు.


బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ధృవీకరణ పత్రాలు లేని వారికి జరిమానా తప్పదని ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. వాహన ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. సిబ్బంది వెంకట్, అంజి రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నీటి ఎద్దడి లేకుండా కౌన్సిలర్ నీలకంఠం తగిన చర్యలు తీసుకున్నారు. బుధవారం రాత్రి బోరు మోటారు కాలిపోవడంతో గురువారం కౌన్సిలర్ స్పందించి కాలనీలో నీటిఎద్దడి రాకుండా కొత్త బోరు మోటారును బిగించారు. కాలనీలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్న కౌన్సిలర్‌ను కాలనీవాసులు అభినందించారు.


బోరు మోటారును బిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యం

బీబీపేట : గ్రామంలో వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యమని బీబీపేట జీపీ కార్యదర్శి రమేశ్ అన్నారు. గురువారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పన్నులు వసూలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికీ తిరిగి ఇంటి పన్ను, స్థలం అద్దె, నీటి పన్నులను, దుకాణాల లైసెన్సులు బిల్లులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కారోబార్ సిద్దరాంలు, సిబ్బంది శంషుద్దీన్ పాల్గొన్నారు.


రసీదు అందజేస్తున్న జీపీ కార్యదర్శి రమేశ్

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య స్వస్థత కేంద్రం
- రూ. లక్షలు వెచ్చించి నిర్మాణం
- ఎనిమిది నెలలుగా నిరుపయోగంగానే..
- అధికారులు స్పందించాలని విజ్ఞప్తులు


ఆర్గొండలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య స్వస్థత కేంద్రం

రాజంపేట : గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరగాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించింది. కేంద్ర ప్రభుత్వ ఆలోచన బాగానే ఉన్నా అమలు చేయడంలో కొంత జాప్యం ఏర్పడుతుందని చెప్పవచ్చు. రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలో ఆరోగ్య స్వస్థత కేంద్ర భవనాన్ని ఆయుష్ మిషన్ నిధులతో నిర్మించారు. నిర్మించి సుమారు 8 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఈ కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గర్భిణులకు సాధీరణ ప్రసవాలయ్యేలా యోగా సాధన, శ్వాస సమస్యలతో బాధపడేవారు, ఇతర వ్యాధుల వారికి చికిత్స అందించేలా వీటిని నిర్మించారు. రూ. లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రం ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని సాధించడం లేదన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. అధికారులు స్పందించి స్వస్థత కేంద్రంను ప్రారంభించి సేవలను ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గ్రామంలోని ఆరోగ్య స్వస్థత కేంద్రంను అధికారులు స్పందించి ప్రారంభమయ్యేలా చూడాలి. అదేవిధంగా యోగా గురువు నియమించాలి. యోగా ద్వారామానసిక ప్రశాంతత కలుగుతుంది. ఈ విషయం దృష్టి సారించాలని కోరుతున్నాం. – సిద్దరాములు, గ్రామస్తుడు

వంతెన నిర్మాణం జరిగేనా..

- శిలాఫలకానికే పరిమితమైన అమర్లబండ వంతెన నిర్మాణం
- త్వరితగతిన పూర్తి చేయాలంటున్న గ్రామస్తులు


సదాశివనగర్ మండలంలోని అమర్లబండ వద్ద వంతెన నిర్మించాల్సిన రోడ్డు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఎంతోమంది నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లుమొరపెట్టుకున్నప్పటికీ తమ సమస్యకు పరిష్కారం లభించట్లేదని అమర్లబండ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలప్పుడే ఆ గ్రామంలో అంతా సందడి ఉంటుంది. ఎన్నికలు పూర్తి కాగానే తమను మరిచిపోతున్నారన్నారు. గ్రామస్తుల విజ్ఞాపన మేరకు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వంతెన నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన కూడా చేశారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. శంకుస్థాపన చేసినప్పటి నుంచి తమ కల నెరవేరుతుందని అనుకున్న వారి ఆశలు అడియాశలుగానే ఉన్నాయి.

వర్షాకాలం వస్తే ఇబ్బందులు

వర్షాకాలం సమీపించిందంటే చాలు ఆ గ్రామ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. వాగు పారుతున్నప్పుడు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత వర్షాకాలంలో వాగుదాటలేని పరిస్థితిలో ఓ నిండు గర్భిణిని ట్రాక్టర్‌పై ఎక్కించి వాగు దాటించి ఆస్పత్రికి తరలించిన సందర్భాలు ఉన్నాయి. వాగు అవతలివైపున ఉన్న రైతులు కూడా ఇలా ట్రాక్టర్‌పై నిలబడి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగును దాటిన ఘటనలు ఉన్నాయి. వం

ఎమ్మెల్యే దృష్టిసారిస్తేనే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మదన్‌మోహన్ రావు ప్రత్యేక దృష్టి సారిస్తే తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంతెన పూర్తవుతుందని కలగన్నాం..



వాగు దగ్గర పనుల నిర్మాణం కోసం శిలాఫలక ఏర్పాటు చేశారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వంతెన కోసం శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.
– ఎర్రోల్ల రాజయ్య, అమర్లబండ గ్రామస్తుడు

నిర్మాణ పనులు పూర్తి చేయాలి



వంతెన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. సుమారు యాభై ఏళ్ల సంది వాగు పారుతున్నప్పుడల్లా ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుత ఎమ్మె ల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాలి.
– పల్లె రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్, అమర్లబండ

ఎన్నో ఆశలు పెట్టుకున్నాం..



నేను పాల వ్యాపారం చే స్తా. వర్షాకాలంలో వాగు పారుతుండడం వల్ల టేక్రియాల్ మీదుగా తిరి గి కామారెడ్డికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. వంతెనకడితే అందరికి మంచిగుంటది. మా తాతల కాలం నుంచి బ్రిడ్జి కావడం లేదు. ఇప్పుడు కాంగ్రెస్ రావడంతో ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.
– శేర్ల రాజు, అమర్లబండ గ్రామస్తుడు

'మోడల్' దరఖాస్తులకు గడువు పొడిగింపు

నిజాంసాగర్(జుక్కల్) : తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువును మార్చి 2 వరకు పొడగించినట్లు అచ్చంపేట మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతితో పాటు 7 నుంచి పదో తరగతిలో ఖాళీగా ఉన్న పరిమిత సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. మోడల్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని నస్రుల్లాబాద్, బొప్పాస్‌పల్లి, లింగంపల్లి, మైలారం గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను గురువారం తహసీల్దార్ ప్రవీణ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్‌స్టేషన్లలో ఉన్న కనీస సౌకర్యాలు నీరు, విద్యుత్తు, మరుగుదొడ్లను పరిశీలన చేశారు.ఆయన వెంట గిర్దావార్ హన్మాండ్లు ఉన్నారు.

సంక్షిప్తం

జీపీ తనిఖీ

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని కందర్‌పల్లి జీపీని గురువారం ఎంపీవో మహబూబ్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. మార్చి చివరి నాటికి వందశాతం పన్ను వసూలు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. పల్లెప్రకృతి వనంలో చెట్లు, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని, మండలంలోని అన్ని జీపీల్లో హౌస్‌టాక్స్ ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని సూచించారు.

పాఠశాలలకు రాగిజావ సరఫరా

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రాగిజావ సరఫరా చేశామని ఎంఈవో రాములు నాయక్ తెలిపారు. ఉదయం ప్రతిరోజు విద్యార్థులకు పాఠశాలలో రాగిజావలో బెల్లం కలిపి ఇస్తారన్నారు. ఏజెన్సీ ద్వారా ఎంఈవో కార్యాలయానికి రాగి పిండి, బెల్లం ప్యాకెట్లు చేరుకున్నాయని, విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రాగిజావా ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.

ఘనంగా సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మండలంలోని యాచారం తండాలో నిర్మించిన జగదాంబ మాత, సేవాలాల్ ఆలయం నేటికీ 35 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తండా నాయకుల ఆధ్వర్యంలో గురువారం వార్షికోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, హోమం, లక్ష పుష్పార్చన, మహా మంగళ హారతి, ప్రత్యేక పూజ చేపట్టారు. రాజరాజేశ్వర కల్యాణం జరిపి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగ్యనాయక్, వైస్ చైర్మన్ లాల్‌సింగ్, కార్యదర్శి పీర్‌సింగ్ నాయక్, తండా నాయకులు సంతోష్ నాయక్, కిషన్ నాయక్, బలిరాం నాయక్, బాబ్య నాయక్, లచ్చిరామ్ నాయక్, ఏమజి నాయక్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపు



బాన్సువాడ పట్టణంలో..


ఎల్లారెడ్డిలో బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు అరుణ్, బాన్సువాడలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. అంగవైకల్యం ఉన్న చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

బాన్సువాడ రూరల్ : శారీరక వికలాంగులైన విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియో థెరఫీ చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు డాక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ఐఈఆర్‌పీఎస్ వెంకట పద్మ, వసంత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

గున్కుల్‌లో దోమల నివారణ మందు స్ప్రే



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్‌లో బుధవారం రాత్రి దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామ పంచాయతీలోని ఆయా కాలనీల్లో ఉన్న మురికి కాలువలు, నివాస గృహాల చుట్టూ దోమల నివారణ మందును స్ప్రే చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి అంజయ్య తెలిపారు.

అన్నదానం



భిక్కనూరు : హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో భిక్కనూరు మండల కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ గోల్కొండ యాదమ్మ కూతురు రచన పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు